
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 23 మే 2025



ఆగిన 'స్వనిధి'..

- ఆరు నెలలుగా అందని రుణాలు
- వీధి వ్యాపారుల ఎదురుచూపులు
- జిల్లాలో 8,418 మంది వీధివ్యాపారుల గుర్తింపు
- రుణాలు పొందిన 7,933 మంది లబ్ధిదారులు





సిరిసిల్లలో వీధి వ్యాపారులు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో మూడు విడతల్లో లబ్ధిదారులు ఇలా..

మున్సిపాలిటీ	మొదటి విడత (రూ.10 వేలు)	రెండో విడత (రూ 20 వేలు)	మూడో విడత (రూ 50 వేలు)
సిరిసిల్ల	5811	4546	1025
వేములవాడ	2122	1634	197
మొత్తం	7933	6180	1222

PM SVANidhi

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కరోనా మహమ్మారితో చితికిపోయిన వీధివ్యాపారు లకు చేయూతనిచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్వనిధి(ఆత్మ నిర్భర్ నిధి) రుణాల ప్రక్రియ చేపట్టింది. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు అందించి చిరు వ్యాపారాన్ని కొనసాగిం చుకునే దిశగా మూడు విడతలుగా అందించే స్వనిధి రుణానికి బ్రేక్‌లు పడ్డాయి. ఆరు నెలలుగా కొత్త రుణాలు ఇవ్వకపోగా, నాలుగు నెలలుగా సంబంధిత పోర్టల్ కూడా నిలిచిపోయింది. స్వనిధి స్థానంలో కొత్త పథకం కసరత్తు చేస్తున్న క్రమంలోనే రుణాల ప్రక్రి య నిలిచిపోయిందని అధికారులు చెబుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరు వ్యాపారులు మాత్రం రుణాలు అందక నిరాశ చెందుతున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో మెప్మా ద్వారా చిన్న తరహాలో రుణాలు అందు కోవ డం ద్వారా వీధి వ్యాపారులకు కొంత ఊరటను ఇచ్చే పథకం మూలన పడడంపై నిరసన వ్యక్తం చేస్తు న్నారు. జీవనోపాధికి ఉపయోగకరంగా ఉన్న స్వనిధి పథకం స్థానంలో కొత్త పథకం కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంది.

● మూడు విడతలుగా రుణాలు..

కేంద్ర ప్రభుత్వం 2020 సంవత్సరంలో కరోనా లాక్‌డౌన్ నుంచి స్వనిధి పథకాన్ని తీసుకవచ్చింది. వీధి వ్యాపారులకు మొదటి విడతగా రూ.10 వేలు, అది చెల్లించిన తరువాత రెండో విడతగా రూ.20 వేలు, మూడో విడతగా రూ.50 వేల రుణాలు ఇచ్చా రు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చాలామంది వీధి వ్యాపారులు మొదటి విడతలో ఎంతో ఉత్సాహంగా తీసుకున్న రూ.10 వేల రుణాన్ని చెల్లించి రూ.20 వేల రుణాన్ని తీసుకున్నారు. మూడో విడతలో మాత్రం ముందుకు రాలేదు. సక్రమంగా చెల్లిస్తున్న వీధి వ్యాపారులు మాత్రం ఆరు నెలలుగా రుణాలు ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన లబ్ధిదారులు మూడో విడతగా రూ.50 వేలు ఇవ్వాలని కోరుతున్నారు.

● మరో పథకానికి కసరత్తు..

ప్రధానమంత్రి స్వనిధి పథకంలో మార్పులు తీసుక వచ్చి వీధి వ్యాపారులకు మరింత మెరుగ్గా రుణాలు అందించే విధంగా కొత్తపథకం తీసుక వచ్చే దిశగానే స్వనిధి పథకాన్ని నిలిపి వేసినట్లుగా భావిస్తున్నారు. ఆత్మనిర్భర్ నిధి కింద కొత్త పథకానికి సాంకేతిక సమస్యలు కూడా ఉన్నా యి. రూ.50నుంచి లక్ష వరకు కూడా పెరిగే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

● జిల్లాలో స్వనిధి ద్వారా రూ26.40 కోట్ల రుణాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వీధి వ్యాపారులకు రుణాలు అందించ డానికి 8,418మంది లక్ష్యంగా పెట్టుకు న్నారు. స్వనిధి ద్వారా జిల్లాలో 26.40 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. దర ఖాస్తులు 8,507మంది మొదటి విడత లోనే చేసుకున్నారు. సిరిసిల్ల, వేముల వాడ రెండు మున్సిపాలిటీల్లో మొదటి విడతలో రూ10 వేల చొప్పున 7,933 మంది రూ7.93 కోట్లు అందించారు. వీరు ఏడాదిలోగా రూ10వేలు చెల్లించి తిరిగి రెండవ విడతలో 6180 మంది రూ 20వేల చొప్పున రూ 12.36కోట్లు రుణం పొందారు. మూడవ విడతలో మాత్రం 1222 మంది రూ 50వేల చొప్పున రూ 6.11 కోట్ల రుణాలు పొందారు. స్వనిధి ప్రక్రియ సక్రమం గానే కొనసా గుతున్న ఆరు నెలలుగా రుణాలు నిలిచి పోవడంతో పథకం పునరు ద్ధరించాలని కోరుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు క్షీరాభిషేకం నిర్వహించారు. గురువారం సారంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మునిగల రాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులు ముఖ్యమంత్రి, మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో భరత్ గౌడ్ గుగ్గిళ్ళ రాములు ఎండి హనీఫ్, గడ్డమీద శ్రీనివాస్, సుంచుల కిషన్, సిరిసిల్ల దేవదాస్, బాలరాజు, అంజయ్య, పురుషోత్తం, కార్యదర్శి సమీర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ

- హనుమాన్ జయంతితో పెరిగిన భక్తుల సంఖ్య



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

7

ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ పనులు

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ ఉత్తర్వు పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సిరిసిల్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి జీర్ణోద్ధారణారధ్య సప్తమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం 4.30గంటల నుంచి ఆలయంలో శ్రీవారి ఆరాధన, మంత్ర హోమాలు, పుష్పమాలిక అలంకరణలు, నివేదనలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవిసహిత శ్రీనివాసుడి కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోవింద నామస్మరణతో భక్తజనం పులకరించి పోయారు. ఈ కార్యక్రమంలో ఈవో మారుతీరావు, దేవస్థానం మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం సిరిసిల్లలోని పలు హనుమాన్ దేవాలయాల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు వేడుకలు నిర్వహించారు.

కమనీయం.. పార్వతీరాజరాజేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా, పార్వతిరాజరాజేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో పురోహితులు స్థాపిత దేవతహవనం, స్వామివారలకు అభిషేకం, పడిపూజ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేదమంత్రోచ్చరణ నడుమ పార్వతి రాజరాజేశ్వరస్వామి కల్యాణాన్ని కన్నులపండువగా జరిపించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ పార్టీల నాయకులు, ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధనం..

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసం సులువైన సాధనమని జిల్లా ప్రోగ్రాం అధికారి తిరుపతి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్‌లోని వృద్ధుల డే కేర్ సెంటర్, ఆయుర్వేద వైద్యశాలలో విద్యార్థులు, వృద్ధులకు గురువారం యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీకాంత్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ మహేష్ బి గీతే, ఇతర అధికారులతో కలిసి నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పాఠశాల పరిసరాల్లో ఉన్న పాన్‌షాప్ వంటి వాటిపై నిఘా పెట్టాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం జరిగిన తర్వాత డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా కూడా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్, మండల వ్యవసాయ అధికారి వైద్య అధికారులు పంచాయతీకార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి దాని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న బార్, వైన్‌షాప్ ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడాలన్నారు. జిల్లాలో ఉన్న సినిమా థియేటర్ల పరిసరాలను రాత్రి సమయంలో తనిఖీలు చేయాలని, రైస్‌మిల్లులు, ఇటుకబట్టీల వద్ద డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రవీణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలీ బేగం, అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎక్సైజ్, విద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతం

సిరిసిల్ల రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడీయేట్ సప్లమెంటరీ పరీక్షలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏర్పాటుచేసిన 13పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరంలో 755 మంది విద్యార్థులకు జనరల్‌లో 688మంది, ఒకేషనల్‌లో 109 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జనరల్‌లో 39మంది, ఒకేషనల్‌లో ముగ్గురు మొత్తం 42మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 275మందికి 244మంది పరీక్షలకు హాజరయ్యారు. జనరల్‌లో 269 మందికి 238మంది హాజరుకాగా 31 మంది గైర్హజరయ్యారు. ఒకేషనల్‌లో ఆరుగురు విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడీయేట్ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

- ఇబ్బందులు పడ్డ రైతులు

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, అక్కపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. ధాన్యం కుప్పల చుట్టు వరద నీరు చేరింది. ధాన్యం కాపాడుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఏర్పడిన గుంతలో వర్షపు నీరు చేరడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీటిలో నుంచే వెళ్లాల్సి వచ్చింది.

ఆపరేషన్ కగార్ పేరిట నరమేధం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : దండకారణ్యంలో ఉన్న మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధాన్ని సృష్టిస్తోందని, ఈ హత్యలను ప్రజాస్వామికవాదులు ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవనంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా మధ్య భారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. ఛతీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వ పోలీస్ బలగాలు జరిపిన కాల్పుల్లో మవోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియస్ బస్వరాజ్‌తో పాటు 34 మంది మావోయిస్టులు చనిపోవడం బాధాకరమన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆ పార్టీ కేంద్ర నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరడంతో పాటు ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని మేధావులు, ప్రజాస్వామికవాదులు కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దేశపౌరులను మావోయిస్టుల పేరుతో హత్యలు చేస్తూ పోతుందని, అడవుల నుంచి మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీలను తమ గ్రామాల నుంచి ఖాళీ చేయించి అటవీ సంపదలను కార్పొరేట్ కంపెనీలకు, బడా పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి పారామిలిటరీ బలగాలను వెనుకకు రప్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న హత్యలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, జిల్లా నాయకులు కిషోర్‌లు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న ఎస్పీ మహేశ్ బి గితే

సిరిసిల్ల క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): దళిత వైతాళికులు, సంఘ సంస్కర్తగా ప్రఖ్యాతిగాంచిన భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ మహేష్ బి. గీతె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దళితుల హక్కులు, సమానత్వం కోసం పోరాడిడన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పద్మ, ఆర్ఐ యాదగిరి, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

రుద్రంగి, మే 22 (ఆంధ్రజ్యోతి) : చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆదేశించారు. గురువారం రుద్రంగి మండలకేంద్రం శివారులోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఏఎస్పీ తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీర్నపల్లిలో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణం..

- అడిషనల్ ఎస్పీ చంద్రయ్య - స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

వీర్నపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల అటవీ మండలం వీర్నపల్లిలో మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మిస్తామని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య అన్నారు. మండలకేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్‌తో కలిసి గురువారం స్థల పరిశీలన చేశారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కాసేపు సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో ముందు నిలవాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ ఎల్లయ్యగౌడ్, సిబ్బంది ఉన్నారు.

నోటీసులతో బీఆర్‌ఎస్ నాయకుల్లో భయం



సిరిసిల్లలో మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో లోపాలు, అవకతవకలపై విచారణకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పటి మంత్రులకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నోటీసులు అందించడంతో బీఆర్ఎస్ నాయకుల్లో భయపట్టుకుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలపై విచారణకు హాజరుకావాలంటే బీఆర్ఎస్ నేతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలు చేశామని ఒప్పుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వ పథకాలను చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఓర్వలేక అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరుట్ల మహేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల తిరుపతి, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, జంగం అంజిరెడ్డి, రాకేష్, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాలవిరమణ బారికేడ్లలో దీక్షాపరులు

స్వామివారికి నమస్కరిస్తున్న భక్తురాలు



ముడుపులతో భక్తుడు

అంజన్నకు భక్తజన హారతి

- కొండగట్టులో వైభవంగా పెద్ద హనుమాన్ జయంతి
- దర్శించుకున్న లక్షన్నరకు పైగా భక్తులు

మల్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు అత్యంత వైభవం గా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్త జనంతో కొండగట్టు కిక్కిరిసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం అర్ధరాత్రి వరకు అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో కొండంతా మారుమోగింది. అంజన్న దీక్షాపరులు మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన కల్యాణ కట్టలో దీక్షలు విరమించారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారి జేఎన్‌టీయూ మార్గంగుండా రామ దండును తలపించేలా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజన సాగరంగా మారింది. దాదా పు లక్షన్నరకు పైగా వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చు కున్నారు. కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ కొండపై పర్య వేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.



ముడుపులు కడుతున్న భక్తులు

● కిక్కిరిసిన దీక్ష విరమణ మండపం

ప్రతియేటా వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అంజన్నసన్నిధిలో ఉదయం 3గంటలకు తిరుమంజనం, ద్రావిడ ప్రబంధ పారాయణములు, విశేషఅభిషేకం, తులసీ అర్చన, శ్రీస్వామివారికి పట్టు వస్త్రాలంకరణ, సహస్ర నాగ వల్లి, అర్చన, హోమం, మహా పూర్ణాహుతితో పాటు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశా లలో త్రైయా హ్నిక, త్రికుండాత్మక యజ్ఞాలను వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయఈవో శ్రీకాంత్‌రావు, ఆలయస్థానా చార్యులు తిరుక్కోవెల కపీంధర్, ప్రధానఅర్చకులు రామకృష్ణ, జితేం దర్‌ప్రసాద్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవస్వామి, మారుతీ ఎండోమెంట్ ఏసీ సుప్రియ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేలాదిగా తరలి వచ్చిన అంజన్న దీక్షాపరులతో కల్యాణ కట్టలో ఏర్పాటు చేసిన దీక్ష విరమణ మండపం కిక్కిరిసింది.

● విప్, ఎమ్మెల్యేల పూజలు

హనుమాన్ జయంతి సంద ర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, చొప్పదండి, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణరావు అంజ న్న దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజల జరిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం యాగశాలలో జరుగు తున్న త్రికుండా త్మక యాగంలో పాల్గొన్నారు.

● మంత్రి పొన్నం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి ట్యాంకర్ మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. పంపిణీ కార్య క్రమాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. కరీంన గర్‌కు చెందిన భక్తులు వేలాది మందికి వైజంక్షన్ వద్ద ఉచిత అన్నదానం చేశారు.

● వర్షంతో భక్తుల రాకకు అంతరాయం

హనుమాన్ జయంతి రెండో రోజైన బుధవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న వర్షంతో భక్తుల రాకకు అంతరాయం ఏర్పడి నట్లు అయింది. దేవస్థానం తర పున వైజంక్షన్ నుంచి వాహనపూజల వరకు ఏర్పాటు చేసిన పందిళ్లు, షామియానలు గాలికి కూలిపోయాయి. గురు వారం ఉదయం, సాయంకాలం కురిసిన వర్షం భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. కొండపైన అడుగడుగున భక్తులకు అపరి శుభ్రత దర్శనమిచ్చింది. అలాగే ఆలయ పరిస రాల్లోనూ చెత్త కనిపించింది. కోనేరులో దీక్షాపరులు వదిలేసిన దుస్తులను వెంట వెంట తీయక పోవడంతో స్నానాల కోసం భక్తులు అసహనానికి గురి అయ్యారు.



మెట్ల మార్గంలో మోకాళ్లతో వస్తున్న దీక్షాపరుడు



మాల విరమణ చేస్తున్న భక్తులు



కొండపైన కలెక్టర్ సత్యప్రసాద్ ఇతర అధికారులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మానకొండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన సముద్రాల రమేశ్(39) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ 15ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడకలేదు. జీవితంపై విరక్తిచెంది ఈనెల20న తనపొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నం..మృతి

మానకొండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన గాజుల తరుణ్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఊటూర్ గ్రామానికి చెందిన తరుణ్‌కు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 19న తమ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. తరుణ్ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



శోభ (ఫైల్)

బోయినపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఎర్ర శోభ(48) ఉదయం స్నానం చేసేందుకు బాత్రూంకు వెళ్లింది. ప్రమాదవశాత్తు బాత్రూమ్ డోర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతుడి భర్త రాజిరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ మూర్తిరామ్ తెలిపారు. కాగా కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ శివారులో కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. బుధవారం రాత్రి రాఘవపూర్ గ్రామానికి చెందిన ఎనుగుల జగన్(25) లొంకకేసారం గ్రామానికి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా రాఘవపూర్ గ్రామ శివారులో ఎదురుగా పెద్దపల్లి వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో జగన్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతుడికి భార్య నిఖిత, రెండున్నర ఏళ్ల కూతురు, మూడునెలల కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ గురునాథ్

సుల్తానాబాద్, మే 22: (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, కుటుంబాలకు సమాజంలో తలవంపులు తేవద్దని సుల్తానాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ అన్నారు. గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో గురువారం జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల అనర్థాల పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతు విద్యార్థులు పాన్, గుట్కా, మత్తు పదార్థాల అలవాటుకులోనై వారి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. పిల్లల అలవాట్ల గురించి తల్లిదండ్రులకు తెలుపుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డ్రగ్స్‌రహిత సమాజాన్ని తయారు చేస్తామంటూ ఉపాధ్యాయులచే ప్రతిజ్ఞ చేయించారు. శ్రీరామచంద్ర మిషన్ స్పీకర్ మారుతి రాజు, ఎక్సైజ్ ఎస్ఐ చిరంజీవి, ఎంఈఓ రాజయ్య, ప్రోగ్రాం అబ్జర్వర్ ప్రద్యుమ్న కుమార్, ఆర్పీలు పాల్గొన్నారు. సుల్తానాబాద్, అంతర్గాం, రామగిరి, జూలపల్లి, ఎలిగేడు, కమాన్‌పూర్, ధర్మారం మండలాలకు చెందిన 160 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వృత్తి నిబద్ధత చాలా గొప్పది

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

కరీంనగర్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల వృత్తి నిబద్ధత గొప్పదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో భాగంగా జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ ఈ టెక్నోపాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణకేంద్రాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తినైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావడం వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనమన్నారు. నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించుటకు ఉపాధ్యాయులు నిరంతరం వారి బోధనను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ కర్రఅశోక్‌రెడ్డి, ఆంజనేయులు, చాడ జయపాల్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, తపస్‌బాధ్యులు కట్టరాజేశ్వర్, ఉదయ్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేశవరావు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్

పెద్దపల్లిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదికసభ్యులు డిమాండ్‌చేశారు. అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తంచేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ రాజ్యాంగంలో జీవించే హక్కు ఉన్నప్పటికీ కేంద్రప్రభుత్వం దండకారణ్యంతో పాటు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలు, డిఆర్‌జి బలగాలు ఎన్‌కౌంటర్‌లతోపాటు అడవుల్లో జీవించే ఆదివాసిలను మావోయిస్టుల పేర ఎన్‌కౌంటర్ చేయడం జీవించేహక్కు కాలరాయడమేనన్నారు. నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధానకార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు27మంది చనిపోవడం ఈఎన్‌కౌంటర్‌లపై పలు అనుమానాలు వ్యక్తఅవుతున్నాయన్నారు. 2024 జనవరి1నుంచి ఇప్పటివరకు 525మందిని ఎన్‌కౌంటర్‌లతో హత్యచేయడం హేయమైనచర్య అని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్రకోకన్వీనర్ మార్వాడీ సుదర్శన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకన్వీనర్ ముడిమడుగుల మల్లన్న,పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాఅధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో సైనికక్యాంపులను ఎత్తివేయాలని కోరారు. విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకన్వీనర్ బాలసాని రాజయ్య, పౌర హక్కుల ఉమ్మడి కరీంనగర్‌జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రవి, పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి రెడ్డిరాజుల సంపత్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు నారా వినోద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాఉపాధ్యక్షులు పుల్ల సుచరిత, రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎరుకల రాజన్న, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లాఅధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గాండ్ల మల్లేశం, పౌరహక్కుల సంఘం సభ్యులు బండారి రాజలింగు, శ్రీపతి రాజగోపాల్, ప్రజాసంఘాల నాయకులు బండి శంకర్, లింగన్న పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

బాధితుడిని స్వదేశానికి రప్పించిన కేటీఆర్

- గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహేష్
- విమానాశ్రయం నుంచి కిమ్స్ ఆసుపత్రికి తరలింపు

తంగళ్లపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): సౌదీఅరేబియాలో రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికిచెందిన మంద మహేష్‌ను స్వదేశానికి రప్పించి బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు అండగా నిలిచారు. ఉపాధికోసం సౌదీ అరేబియా వెళ్లిన మండేపల్లి గ్రామానికి చెందిన మంద మహేష్ పదిహేను రోజులక్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తనను స్వదేశానికి రప్పించి చికిత్స చేయించాలని కేటీఆర్‌ను వేడుకుంటూ కన్నీరుపెడుతూ సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అదిచూసిన కేటీఆర్ స్పందించి మండెపల్లిలో కుటుంబాన్ని పరామర్శించి వారంరోజుల్లోగా స్వదేశానికి రప్పించి చికిత్స చేయిస్తానని హామీఇచ్చారు. ఫోన్‌ద్వారా మహేష్‌కు ధైర్యం చెప్పారు. కేటీఆర్‌చొరవతో మహేష్‌కు చికిత్స చేస్తామని అంగీకరిస్తూ సౌదీలోని ప్రభుత్వఆసుపత్రికి హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ ఆసుపత్రి యజమాన్యం లేఖ రాసింది. సౌదీలో ఉన్న కేటీఆర్ అభిమానులు ఆసుపత్రి నుంచి మహేష్‌ను డిశ్చార్జ్‌చేసి స్వదేశానికి పంపించారు. గురువారం ఉదయం మహేష్ విమానాశ్రయంలో దిగగానే బీఆర్ఎస్ నాయకులు బండి దేవదాస్, గజభీంకర్ రాజన్న, బుస్స లింగం నేరుగా కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న మహేష్‌ను గల్ఫ్ నుంచి స్వదేశానికి రప్పించి చికిత్స చేయిస్తున్న కేటీఆర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మహేష్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎలిగేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదేగ్రామానికి చెందిన వేల్పూరి మాధవరావు(50)కి తీవ్రగాయాలై రెండుకాళ్లు విరిగిపోయాయి. శివపల్లిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న మాధవరావును బలంగా ఢీ కొంది. ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లడంతో కిందపడిన మాధవరావు రెండుకాళ్లు విరిగినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన స్థానికులు హుటాహుటిన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా వాహనం నడుపుతు ఈప్రమాదానికి కారకుడయ్యాడని గ్రామస్థులు తెలిపారు.

కోనరావుపేట మండల కేంద్రంలో చోరీ

- డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహించిన పోలీసులు
- రూ.40వేల కిరాణం సామాను 10 వేల నగదు అపహరణ

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలో ఓ కిరాణం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.40 వేల కిరాణం సామాను 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహిస్తున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు కూతపేటు దూరంలో ఉన్న పుల్కం జలంధర్‌కు చెందిన హోల్‌సేల్ కిరాణం దుకాణంలో డోర్లు పగలగొట్టి లోనికి చొరబడి పదివేల నగదు సుమారు 40వేల విలువగల సామగ్రిని అపహరించారు. మండల కేంద్రంలో డీజే సౌండ్ ఓ పెండ్లి సందడిలో ఉండగా ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు సౌండ్ వినపడకుండా డోర్లు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఇది సీరియస్‌గా తీసుకున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి వెంటనే రంగంలోకి దిగి సోదాలు నిర్వహిస్తున్నారు.



డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

రెండు లారీలు ఢీ

- డ్రైవర్ మృతి, మరో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని ఇరుకుల్ల వద్ద రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి 8 గంటలకు రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండువాహనాల డ్రైవర్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడగా వారిని పోలీసులు, స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లారీడ్రైవర్ జిన్నా(25) మృతిచెందాడని కరీంనగర్ రూరల్‌సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌నుంచి గోదావరిఖనివైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న మరోలారీని ఢీకొట్టింది. ఇదే సమయంలో ఒకకారును ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ గ్రామాలోని గెంటె రాములు, పాండవుల నగేశ్‌కు చెందిన ఐదు జీవాలు గురువారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. మండల కేంద్రంలోని గెంటెరాములు గొర్రెలు వర్షానికి డివైడర్ పైకి ఎక్కగా, మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలకు అమర్చిన ఎర్త్‌వైర్‌కు విద్యుత్తు సరఫరా కావడంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వెంకటాపూర్‌లోని నగేశ్‌కు చెందిన మూడు మేకలు గ్రామ శివారులోకి మేతకు వెళ్లాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద ఉన్న సపోర్టు వైరుకు కరెంటు సరఫరాకావడంతో చనిపోయాయి. జీవాల విలువ సుమారురూ.90వేలు ఉంటుందని బాధితులు రాములు, నగేశ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో జరిగిన ఘటన స్థలానికి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటినర్సయ్య వెళ్లి పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వీర్నపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రంలోని విద్యుత్‌వైరు తగిలి గర్జనపల్లి గ్రామంలో గురువారం మేక మృతిచెందింది. గ్రామానికి చెందిన అబ్బాస్ అనే కాపరి మేకమేస్తుండగా కొనుగోలు కేంద్రంలో లైట్లకోసం అమర్చిన విద్యుత్‌వైర్లు తేలి ఉండడంతో తీగలుతగిలి మేక అక్కడికక్కడే మృతిచెందింది. కాగామృతిచెందిన మేకవిలువ రూ.10వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.



రామగిరి మండలంలో మృతి చెందిన మేకలు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం సాయంత్రం విద్యుత్‌షాక్‌తో పన్నూరు గ్రామానికి చెందిన మేకలు మృతి చెందాయి. పన్నూరు గ్రామానికి చెందిన కాపరి మేకలను మేతకోసం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి తీసికెళ్లాడు. వర్షం, గాలి వీయడంతో విద్యుత్ వైర్లు తెగి మేకలపై పడడంతో పన్నూరు గ్రామానికి చెందిన పరుషవేణ రాజయ్య, ఉడుత రాయమల్లు, తొట్లకొమురయ్య, పెరుమల్ల శంకర్‌లకు చెందిన ఐదు మేకలు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాయి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ అధికారులను కోరారు.

మత్తడి దూకుతున్న చిన్నరాయుని కుంట

● వేసవిలో జలకళ.. రైతుల హర్షం..



మండుటెండలో మత్తడి దూకుతున్న చెన్నరాయుని కుంట

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో చిన్నరాయుని కుంట నీటితో కళకళలాడుతూ మత్తడి దూకడంతో పలుగ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నుంచి 15 రోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేసవిలో సాగునీరు అందించేందుకు నీటిని కుడికాలువ ద్వారా విడుదల చేశారు. నాగారం, సుద్దాల, మారుపాక చెరువుల్లోకి నీరు చేరి కళకళలాడుతున్నాయి. సుద్దాల చిన్నరాయుడు కుంట పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. కాగా, నాగారం, మారుపాక చెరువులో నీరు నిండుకుండలా తలపిస్తున్నాయి. కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మల్కపేట రిజర్వాయర్‌లోకి మధ్య మానేరు నుంచి సొరంగం ద్వారా నీటిని నింపి కుడి కాలువ ద్వారా నీటి విడుదల చేయగా పలు గ్రామాల చెరువులు నిండుతున్నాయి. దీంతో మండల ప్రజలు రెండు పంటల సాగుకు నీరు అందుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాజానికి మంచి చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరికీ ఉండాలి

● త్రిదండి చినజీయర్‌స్వామి



మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్‌స్వామి

హుజూరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): సమాజానికి మంచి చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరి మనసులో ఉండాలని త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. గురువారం రాత్రి హుజూరాబాద్ పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ధ్వజస్తంభ, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాగశాలలో హోమం నిర్వహించి, ధ్వజస్తంభానికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటివిద్య యాంత్రికంగా ఉంటుందని, అలాంటి విద్యవల్ల యంత్రాలాంటి మనుషులే తయారవుతున్నారన్నారు. నేటిబాలలే రేపటి భావిభారత పౌరులని, మంచి భావాలున్న బాలలను తయారుచేసే ఉత్కృష్ట కార్యక్రమాన్ని వికాసతరంగిణి చేపట్టిందన్నారు. సమాజానికి మంచిచేయాలనే సంకల్పంనేటి మనుషుల్లో పెంపొందించడానికి వికాస తరంగిణి కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, న్యాయమూర్తి సంధ్యారాణి, వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ,ఆలయచైర్మన్ క్యాసచక్రధర్,అర్చకులు, భక్తులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్‌లో 19మంది డీబార్

గణేశ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ, రెండో సెమిస్టర్ పరీక్షల్లో గురువారం 19మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్ తెలిపారు. కిమ్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో - 1, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంభీరావుపేటలో-7, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో -5, కేఎల్‌ఎన్ఎస్ఎస్‌పీ డిగ్రీ కళాశాల ధర్మపురిలో-3, శివాని డిగ్రీకళాశాల కరీంనగర్‌లో-3, మొత్తం 19మందివిద్యార్థులు డీబార్‌అయినట్లు తెలిపారు.

దారులన్నీ కాళేశ్వరం వైపే..



● ఎనిమిదో రోజు లక్ష మంది పుష్కర స్నానాలు
● బుధవారం రాత్రి కురిసిన వర్షంతో ఇబ్బందులు
● ట్రాఫిక్‌ను మళ్లించినా తప్పని తిప్పలు
● అడవిలో ఐదు కిలోమీటర్ల మేర జామ్

భూపాలపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. పుష్కరాలు ప్రారంభమై ఎనిమిది రోజులు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు బస్సులు, ప్రైవేటు వాహనాల్లో త్రిలింగ క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. పుష్కరాలు మరో నాలుగు రోజుల్లో ముగియనుండడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పుష్కరాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం దాదాపు లక్ష మంది భక్తులు సరస్వతీ నదిలో పుష్కర స్నానాలు ఆచరించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కసారిగా భక్తుల సంఖ్య పెరగడంతో పుష్కర ఘాట్లు జనంతో కిటకిటలాడాయి. ముక్తీశ్వరాలయంలోనూ స్వామివారి దర్శనం కోసం భక్తులకు నాలుగు గంటల సమయం పడుతోంది. బుధవారం రాత్రి కాళేశ్వరంలో కురిసిన భారీ వర్షం కారణంగా క్షేత్రమంతా నీరు నిలిచి బురదమయం కావడంతో పుష్కర ఘాట్లతోపాటు, తాత్కాలిక బస్టాండ్, పుష్కర ఘాట్లకు వెళ్లే మట్టి రోడ్లు బురదతో నిండిపోయి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్ స్థలాల్లో వర్షం కారణంగా నీరు నిలిచి వాహనాలు కూరుకుపోవడంతో వాటిని బయటకు తీసి ట్రాఫిక్‌ని క్లియర్ చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించారు.

కాళేశ్వరం క్షేత్ర మంతా నల్లరేగడి మట్టితో కూడిన నేల కావడంతో వర్షానికి మొత్తం బురదగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దాంతో పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఏడు కిలోమీటర్ల దూరంలోని అన్నారం క్రాస్ నుంచి కాళేశ్వరానికి వాహనాలను మళ్లించారు. పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు కదలకపోవడంతో దాదాపు ఐదు కిలోమీటర్ల మేర అడవిలోనే ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనాలు చిక్కుకుపోయాయి. దాంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్రేన్లు, ట్రాక్టర్లను రంగంలోకి దింపి ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వాహనాలను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు పుష్కర ఘాట్లకు సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీ మొత్తం వర్షపు నీటితో బురద మయం కావడంతో అధికారులు వెట్ మిక్స్ చల్లి బురదను నియంత్రించే ప్రయత్నం చేశారు. వర్షం కారణంగా కూలిపోయిన టెంట్లను తిరిగి పునరుద్ధరించారు. చివరి మూడు రోజుల్లో భక్తులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. కలెక్టర్ రాహుల్‌శర్మ కాళేశ్వరంలో ద్విచక్ర వాహనం పై తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతీ పుష్కరాల్లో ఎనిమిదో రోజు గురువారం నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యుడు సూర్యనారాయణ, ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్‌రెడ్డి, వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యుడు గడుగు గంగాధర్, సినీ నటుడు అల్లు అర్జున్ తల్లి అల్లు నిర్మల తదితరులు స్నానాలు చేశారు.



స్నానాలాచరిస్తున్న భక్తులు



నదిలో దీపాలను వదులుతున్న మహిళలు



ఎడ్లబండ్లపై వెళుతున్న భక్తులు

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

● సైబర్ నేరగాళ్లకు మూడు వేల డాలర్లకు విక్రయం
● మానవ అక్రమ రవాణా కేసులో నిందితుడు హితేష్ అరెస్టు
● ఢిల్లీలో అదుపులోకి తీసుకుని మానకొండూర్ పీఎస్‌కు తరలింపు

కరీంనగర్ క్రైం/మానకొండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు.. లక్షల్లో జీతం అంటూ ఇచ్చే ప్రకటలకు ఆకర్షితులైన యువతను మోసం చేశాడు గుజరాత్‌కు చెందిన హితేష్. పలు రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించుకుని వారి ద్వారా యువకులను ఆకర్షించాడు. వారి మాటలు నమ్మి అక్కడికి వెళ్లిన వారిని సైబర్ నేరాలు చేసే వారికి అమ్ముకున్నాడు. వీరి వలకు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగంపేట గ్రామానికి చెందిన కొక్కిరాల మధుకర్‌రెడ్డి చిక్కాడు. అతడిని మయన్మార్ పంపించి సైబర్ నేరాలు చేయించేవారు. ఆ పని చేయనంటే చిత్ర హింసలు పెట్టేవారు. మధుకర్‌రెడ్డి అక్కడి నుంచి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి తన గోడును వెళ్లబోసుకున్నాడు. ఆయన చొరవతో 540 మందికి విముక్తి లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు హితేష్‌ను పోలీసులు బుధవారం ఢిల్లీలో అరెస్టు చేసి మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి..

విదేశాల్లో కంప్యూటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురిని సైబర్ కేఫ్‌లకు విక్రయించిన కేసులో నిందితుడు గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్‌కు చెందిన హితేష్‌ను మానకొండూర్ పోలీసులు బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని మానకొండూర్‌కు తీసుకువచ్చారు. హితేష్‌కు తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులకు విదేశాల్లో కంప్యూటర్ ఉద్యోగాలిప్పిస్తానని, నెలకు లక్ష రూపాయల జీతం ఉంటుందని నమ్మబలికి సైబర్ నేరాలకు పాల్పడే వారికి మూడు వేల డాలర్లకు విక్రయించేవాడు. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన శ్యాంరావు హితేష్‌కు ఏజెంటుగా ఉంటూ గత ఏడాది డిసెంబరులో మానకొండూర్ మండలం రంగంపేట గ్రామానికి చెందిన కొక్కిరాల మధుకర్‌రెడ్డిని మయన్మార్‌లో కంప్యూటర్ ఉద్యోగమంటూ అక్కడికి పంపించారు. అక్కడి సైబర్ కేఫ్ నిర్వాహకులు మధుకర్‌రెడ్డి చేత బలవంతంగా సైబర్ నేరాలకు సంబంధించిన ఫోన్, వాట్సప్ కాల్స్ చేయించారు. ఈ పని ఇష్టం లేదంటూ మధుకర్‌రెడ్డి నిర్వాహకులతో గొడవకు దిగాడు. దీంతో వారు అతడిని చిత్రహింసలు పెట్టారు. ఈ విషయాన్ని మధుకర్‌రెడ్డి ఫోన్ ద్వారా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమారుకు తెలిపాడు. ఆయన హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లి మయన్మార్‌లోని సైబర్ కేఫ్‌లలో చిక్కుకుని వేధింపులకు గురవుతున్న 540 మందిని మయన్మార్ సైన్యం సహాయంతో విడిపించి భారత్‌కు తీసుకువచ్చారు. మధుకర్‌రెడ్డి ఫిర్యాదుతో మానకొండూర్ పోలీసు ఠాణాలో హితేష్‌పై మానవ అక్రమరవాణా కేసు నమోదైంది. ఈ కేసులో మానకొండూర్ పోలీసులు మార్చి నెలలో హితేష్‌పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం మయన్మార్‌లో ఉంటున్న హితేష్‌ను అప్పగించాలని భారత విదేశాంగ శాఖ కోరిక మేరకు అతన్ని మంగళవారం మయన్మార్ అధికారులు ఇండియాకు డిపోర్ట్ చేశారు. బుధవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన హితేష్‌ను ఇక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని విదేశాంగశాఖ అధికారులకు అప్పగించారు. హితేష్ ఇండియాకు వస్తున్నాడనే సమాచారంతో మానకొండూర్ పోలీసులు ఢిల్లీ విమానాశ్రయంలో వేచి ఉన్నారు. ముందుగా గుజరాత్ పోలీసులు హితేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జోక్యంతో హితేష్‌ను మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. హితేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ తెలిపారు.



హితేష్ అరెస్టు వివరాలు తెలుపుతున్న రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాష్

వేములవాడలో భక్తుల రద్దీ

● హనుమాన్ జయంతితో పెరిగిన భక్తుల సంఖ్య



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి గురువారం భక్తుల రద్దీ మరింతగా పెరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు అంచనా వేస్తున్నారు. భక్తులు ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని రాజన్నను దర్శించుకుని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతల ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మ్యాన్‌హోల్‌లో పడిన యువకుడు

● రక్షించిన ఫైర్ స్టేషన్ సిబ్బంది



బాధితుడి వాహనాన్ని బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు


జగిత్యాల అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మ్యాన్‌హోల్‌లో పట్టణానికి చెందిన ముకుందరెడ్డి అనే యువకుడు గురువారం రాత్రి తన ద్విచక్రవాహనంతోపాటు పడిపోయాడు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనంతోపాటు యువకుడిని బయటకు తీశారు. ఎస్సారెస్పీ ఉపకాలువను పైపులతో మూసి అక్కడక్కడ మ్యాన్‌హోల్‌లు ఏర్పాటుచేశారు. గురువారం ఉదయం నుంచి పట్టణంలో భారీవర్షం కురుస్తుండగా నాలా ఉధృతంగా ప్రవహిస్తున్నది. అదృష్టవశాత్తు మ్యాన్ హోల్‌లో పడ్డ వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. అయితే నిత్యం వేలాది మంది తిరిగే ప్రాంతంలో ఉన్న మ్యాన్ హోల్‌పై ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ఉండడం వల్ల ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు.

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7450 పలికింది. గురువారం మార్కెట్‌యార్డుకు ఇద్దరు రైతులు 18క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.7450, కనిష్ఠధర రూ.7400చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సేంద్రియ ఎరువుల వైపు రైతుల చూపు

● భూసారం పెంపునకు ఆవు, కోడి ఎరువు వినియోగం ● అధిక దిగుబడుల కోసం అన్నదాతల యత్నం



కథలాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : భూసారం పెంపునకు పలువురు రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతిని పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులను శాస్త్రవేత్తలు అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు ఆవుల మందను పొలాల్లో నిలుపుకుని ఆవు పేడ, మూత్రంతో భూసారాన్ని పెంచుకుంటున్నారు. సుమారు వంద ఆవులు ఉన్న మందను ఒక రోజు పొలంలో నిలిపితే సుమారు రూ.8 వేల ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. వానాకాలం, యాసంగి రెండు పంటలకు ఈ సేంద్రియ ఎరువు పనిచేస్తుందని రైతులు అంటున్నారు. కథలాపూర్ మండలంలో హైదరాబాద్ నుంచి కోడి ఎరువు లారీలను తెప్పిస్తున్నారు. లారీ ఎరువును రెండు ఎకరాలకు సరిపడేలా చల్లుకుంటున్నారు. ఇబ్బడి ముబ్బడిగా రసాయనిక ఎరువులను వినియోగించడం వల్ల ఎదురవుతున్న దుష్ప్రభావాలను రైతాంగం గుర్తిస్తోందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఆవుల మందలను కమ్మరిపల్లి మండలం మానాల నుంచి అక్కడి గిరిజనులు తెచ్చి రైతుల పొలాల్లో నిలుపుతున్నారు. నవంబర్ నుంచి మే దాకా దాదాపు ఆరు మాసాల పాటు ఆవులను పొలాల్లో నిలుపుతూ వారు ఉపాధి పొందుతున్నారు. మరికొందరు రైతులు చెరువుల్లోని మట్టిని పోసుకుని భూసారాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతోంది

ఏలేటి మారుతి, రైతు, భూషణ్‌రావుపేట



రసాయనిక ఎరువులను భారీగా వినియోగి స్తున్నందు వల్ల భూముల్లో ఉన్న పోషకాలు దెబ్బతింటున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతులన చైతన్యవంతం చేస్తు న్నందు వల్ల చాలా మంది సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. భూ సారం పెంపునకు కోడి ఎరువు, ఆవు పేడ, చెరు వు మట్టి వినియోగిస్తున్నాం. సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల దిగుబడులు పెరుగుతున్నాయి.

ఆవుల మందతో ఉపాధి

లావుడ్య లక్ష్మి, మానాల



వానలు పూర్తిగా తగ్గిపోయిన తర్వాత సేంద్రియ ఎరువు అవసరమైన రైతులు ఆవులను తమ పొలాల్లో నిలుపుకుంటారు. పేడ, మూత్రం వల్ల భూముల్లో సారం పెరిగి అధికంగా దిగుబడులు వస్తాయి. రైతులు పోటీ పడి ఆవులను పొలాల్లో పెట్టుకుంటుండగా మాకు ఉపాధి లభిస్తోంది.

బదిలీపై వెళుతున్న ఏసీపీ, సీఐలకు వీడ్కోలు

కోల్‌సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషరేట్‌లో ఎస్‌బీ, ఏసీపీగా పనిచేసి హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌కు బదిలీఅయిన ఏసీపీ రాఘవేంద్రరావు, కొమురంభీం ఆసిఫాబాద్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌లకు గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. సీపీ అంబర్ కిశోర్‌ఝా వీరికి శాలువాలు కప్పి మెమెంటోలు అందించారు. అంకితభావంతో విధులు నిర్వహించారని సీపీ అభినందించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏసీపీ రాఘవేంద్రరావును సన్మానిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సింగరేణి స్టాల్స్‌ను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు



సింగరేణి సేవా సమితి స్టాల్‌ను సందర్శిస్తున్న ప్రపంచ సుందరీమణి పోటీదారులు

గోదావరిఖని, మే 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా మహిళా శక్తిబజార్‌ను గురువారం ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. సింగరేణి సేవా సమితి స్వయం ఉత్పత్తిదారులను వస్త్ర విక్రయశాలను, బ్యాగులు, చేతి పర్సులు, మగ్గం వర్క్‌లతో చేసిన దుస్తులను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు చక్కగా ఉన్నాయంటూ ప్రశంసలు కురిపించారు. సింగరేణి సేవాసమితిద్వారా శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధిదిశగా ప్రోత్సహించిన సింగరేణియాజమాన్యానికి, సీఎండీ బలరాంనాయక్‌కు సేవా సమితి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌టీ సర్వీసుల మంజూరునకు సింగిల్ విండో వ్యవస్థ

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హెచ్‌టీ 11 కేవీ, 33కేవీ ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టామని కరీంనగర్ సర్కిల్ సూపరెంటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్‌బాబు తెలిపారు. ఇందుకు హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11కేవీ వోల్టేజి దరఖాస్తు లను సర్కిల్ ఆఫీస్ ఏడీఈ కమర్షియల్ అధికారి మానిటర్ చేస్తారని తెలిపారు. 33కేవీ ఆపై వోల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారని తెలిపారు. మొదట వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో ఎచ్‌టీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 11 కేవీ వోల్టేజీ దరఖాస్తులు పరిశీలించి ఫీజిబులిటీ ఉంటే రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయబడుతుందన్నారు. ఏవైనా కారణాలు ఉంటే రిమార్క్‌లు వినియోగదారునికి ఎస్ఎంఎస్ రూపేణా వస్తుంద న్నారు. 33కేవీ ఆపై దరఖాస్తులు పరిశీలించి సమయానుగుణంగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సింగిల్‌విండో వ్యవస్థతో త్వరితంగా సర్వీసులు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యాలయానికి రాకుండా దరఖాస్తును ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉంటుందని అన్నారు.

ఘనంగా గంగాధర ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇల్లంతకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గంగాధర ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకుడు మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో గురువారం నవచండీ మహాయాగ సహిత శతరుద్రాభిషేకం, స్ఫటిక లింగానికి అభిషేకం నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాధాకృష్ణ భజన, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వేదపండితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో లబ్ధిదారురాలు భాగ్యలక్ష్మికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపీడీవో సత్తయ్య, స్థానిక నాయకులు గురువారం భూమి పూజ చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాయకులు బాబు, రవీందర్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమ నేత సత్యనారాయణ వర్ధంతి

సిరిసిల్ల రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కార్మికోద్యమ నేత పర్సా సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మికభవనంలో గురువారం పర్సా సత్యనారాయణ వర్ధంతిని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, బెజుగం సురేష్, జిందం కమలాకర్, బింగి సంపత్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సెస్ కార్యాలయానికి నూతన భవనం



శిథిలావస్థకు చేరిన గంభీరావుపేటలోని సెస్ కార్యాలయం

గంభీరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల నూతన సెస్ కార్యాలయ భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సెస్ కార్యాలయ భవనం గదుల పైకప్పు పగుళ్లు చూపింది. వర్షాకాలంలోనైతే గదుల్లో వర్షం నీరు చేరి, సిబ్బంది ఇబ్బందిపడేది. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఇటీవలనే సెస్ ఆఫీస్‌ను అద్దె భవనంలోకి మార్చారు. సెస్ ఆఫీస్ పరిస్థితిపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈక్రమంలో సెస్ నిధుల నుంచి రూ. 67 లక్షలు మంజూరు అయ్యాయి. ఈనెల 15న టెండర్ కూడా పూర్తి అయ్యింది. హాల్, డైరెక్టర్ రూం, సిబ్బంది గది, ఏఈ గది నిర్మాణం జరగనున్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. పేదకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, బాలచందర్, హైమద్, విఠల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నందు, రాజయ్య, బాలయ్య, సురేశ్, రవి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఒగ్గు అఖిలకు మంజూరైన రూ.36వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మరాటి మల్లిక్, భైరగోని రమేష్, ఎండి ఇస్మాయిల్, ముత్యాల నరేష్, బండి శ్రావణ్ కుమార్, సంపునూరు మురళి, ఉప్పుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఆలయ పైకప్పు

ఇల్లంతకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాకలోని నర్సింహ్మస్వామి ఆలయ పైకప్పు కూలడంతో పెను ప్రమాదం తప్పింది. పురాతనమైన నర్సింహ్మస్వామి ఆలయం రెండురోజులుగా పడుతున్న వర్షంతో గురువారం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిన ఆలయపైకప్పును నాయకులు ఖాత మల్లేశం, తోట మధుసూదన్, రొండ్ల రాంరెడ్డి తదితరులు పరిశీలించి, నిధులు మంజూరు చేసి ఆలయ పైకప్పును పునరుద్ధరించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం..

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని కరీంనగర్ సన్‌రైజ్ హాస్పిటల్ వైద్యులు సురేష్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో కేపీఎల్ క్రికెట్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫియర్స్‌ఫైటర్ టీంకు డ్రెస్‌లు అందజేసి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

చౌడాలమ్మ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్..



బావుసాయిపేటలోని చౌడాలమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామంలో జరుగుతున్న చౌడాలమ్మ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం పాల్గొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని నియోజకవర్గ ప్రజలు బాగుండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, నందు గౌడ్, పెంతల శ్రీనివాస్, మానుక సత్యం, నాలుక సత్యం తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన సర్వాయి చెరువు కట్ట

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ శివారులోని సర్వాయి చెరువు కట్ట కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోనరావుపేట మండల కేంద్రానికి చెరువు కట్ట పైనుంచి నిత్యం వెళ్తుంటారు. ఈ కట్ట కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వాహనాలు వెళ్లకుండా ప్రమాదకరంగా మారడంతో అధికారులు స్పందించి కోతకు గురైన కట్టను బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ పనులు

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - 484 మందికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వుల అందజేత

వేములవాడ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండల పరిషత్‌లో మున్సిపల్ పరిధిలోని 484 మందికి ఇందిరమ్మ రెండవ విడుత ఇళ్ల మంజూరు ఉత్తర్వులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు మొదటి విడుతలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికి నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాలేదని అన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాలలో ప్రతి సంవత్సరం అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో కొన్ని వేల కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదగా శంకుస్థాపన చేశామని తెలిపారు. గతంలో పాలకులు వేములవాడ రాజన్న ఆలయానికి ప్రతి యేటా రూ.100 కోట్లు విడుదల చేస్తామని ప్రగల్భాలు పలికి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. వర్షకాలం ముగిసిన తరువాత మూడో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామన్నారు. గుడిచెరువులో మురుగునీరు కలువకుండా, మూలవాగు శుభ్రం చేయడానికి 9 కోట్ల రూపాయల ఖర్చుతో నివారణ చర్యలు చేపట్టామని అన్నారు. వేములవాడ ఆలయ విస్తరణ పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. ఆలయం మూసివేస్తామని లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, భక్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రతి నిత్యం స్వామివారికి పూజలు జరుగుతాయన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. 400 నుంచి 600 అడుగుల లోపు నిర్మాణం జరుగుతే నాలుగు దశల్లో గ్రీన్ చానల్ ద్వారా రూ.5 లక్షల సహాయం అందిస్తామని అన్నారు. బేస్‌మెంట్ దశలో రూ.లక్ష, గోడల నిర్మాణ సమయంలో రూ.లక్ష స్లాబ్ దశలో రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తి అయిన తరువాత మరో లక్ష రూపాయలు అందిస్తామని అన్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు కూడా రెండవ దశలో ఇళ్లకల తప్పకుండా ఇస్తామని, ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం తరపున ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

భూమిలేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

భూమిలేని నిరుపేదలకు అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి అందించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ప్రణాళిక రూపొందిస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వు పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రాబోయే రోజుల్లో భూమి లేని నిరుపేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చర్యలు తీసుకుంటుందన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో గురువారం పంపిణీ చేసిన 484 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు 30రోజుల్లో ప్రారంభించాలని సూచించారు. ఇంటి నిర్మాణంలో పేదలకు పూర్తి సహకారం అందిస్తామని, పెట్టుబడి లేని పేదలకు లక్ష రూపాయలు స్వయం సహాయక మహిళ సంఘాల ద్వారా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా లీగల్ మెట్రోలజీ కార్యాలయం

- అందుబాటులో ఉండని అధికారులు - ఫిర్యాదులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

సిరిసిల్ల రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో అధిక ధరలకు సరుకుల విక్రయాలతో పాటు తూనికలు కొలతల్లో మోసాలను అరికట్టాల్సిన జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారులు సిరిసిల్ల జిల్లాలో కనిపించడం లేదు. దీంతో అధిక ధరలపై ఫిర్యాదులు చేసేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో మూలన వినియోగదారులకు కనిపించకుండా సంబంధిత అధికారులు తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు కార్యాలయం మొత్తం చెత్తచెదారంతో నిండిపోయి ఉంటుంది. అందులో జిల్లా మెట్రోలజీ అధికారితో పాటు మరొకరు ప్రభుత్వ ఉద్యోగి పనిచేస్తుండగా, కొందరు ప్రైవేటు వ్యక్తులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు 12 మండలాల్లో వ్యాపారులు సరుకులను అధిక ధరలకు విక్రయించడంతోపాటు తూనికలు, కొలతల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారుల దోపిడీపై ఫిర్యాదులు చేయాలంటే కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో పనిచేస్తున్న లీగల్ మెట్రోలజీ అధికారులు మాత్రం స్థానికంగా కాకుండా కరీంనగర్‌లో నివాసం ఉంటూ వారానికి ఒకసారి చుట్టపుచూపుగా వచ్చి మొక్కుబడిగా తనిఖీలు చేసి పోతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టరేట్‌లో లీగల్ మెట్రోలజీ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి వినియోగదారులకు సేవలు అందించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులదే రాజ్యం..

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వినియోగదారులకు కనిపించకుండా మూలన పాత భవనంలో ఏర్పాటుచేసిన లీగ్ మెట్రోలజీ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులదే రాజ్యం కొనసాగుతోంది. జిల్లా అధికారి లేకపోయినా ఆయన వాహనంలో ప్రైవేటు వ్యక్తులు పర్యటిస్తూ షాపింగ్‌మాల్స్ పెద్ద పెద్ద దుకాణాల్లో మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ప్రచారంలో ఉంది. కలెక్టర్ స్పందించి ఈ విషయమై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.



సిరిసిల్లలోని లీగల్ మెట్రోలజీ కార్యాలయం

ఫిర్యాదు చేద్దామంటే కార్యాలయం ఎక్కడ ఉందో తెలియదు..

- బూర విష్ణువర్ధన్, రగుడు, సిరిసిల్ల



సిరిసిల్ల పట్టణంలో అధిక ధరల విక్రయాలపై లీగల్ మెట్రోలజీ అధికారులకు ఫిర్యాదులు చేద్దామంటే కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా భారీషాపింగ్‌మాల్స్ సూపర్ మార్కెట్, మద్యం షాపుల్లో ఏర్పాటు చేసే పర్మిట్ రూంతోపాటు బార్‌లలో తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి లీగల్ మెట్రోలజీ కార్యాలయాన్ని వినియోగదారులకు తెలిసే విధంగా ఏర్పాటు చేయించాలి.

భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులు వాడాలి

చందుర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షల ఫలితాలను బట్టి పంటలకు ఎరువులను వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కే.కనకదుర్గ, భవ్యశ్రీలు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలకు సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియాను వినియోగించాలన్నారు. అధికమోతాదులో యూరియా వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్ట్ పేడ ఎరువులను వినియోగించాలని సూచించారు. భూసారపరీక్షల ఫలితాలను బట్టి పంటలకు ఎరువులను వాడడంవలన సాగు ఖర్చు తగ్గించడమే కాకుండా, చీడపీడల ఉధృతిని బట్టి సరైన మోతాదులో రసాయనిక మందులను వాడాలన్నారు. వరిలో నాణ్యమైన సన్నం రకం, దొడ్డు రకాలు, అగ్గితెగులును తట్టుకునే రకాలపై, పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం, పంట వైఫల్యాల సమయంలో పంట బీమా పొందే విధివిధానాలను, రసాయనిక మందుల కొనుగోలు రసీదులను భద్రపరచడం, ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జె. రామారావు, ఏఎంసి చైర్మన్ చేలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, హార్టికల్చర్ ఆఫీసర్ లోకేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు యోగేశ్వర్, ప్రవీణ్, రమ్య, శిరీష, శారద, విద్యార్థులు, ఆర్.ఆశిష్, జె.శిరీష, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఇల్లంతకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో భక్తిప్రపత్తుల మధ్య హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. పొత్తూరు గ్రామంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పాల్గొని పూజలు చేశారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని రాగిచెట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హన్‌మాన్ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు రాచర్ల పార్థసారదిశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

వైకుంఠధామంలో సమస్యలు పరిష్కరించండి

వేములవాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని వైకుంఠధామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ నాయకులు కడారి రాములు, కుమ్మరి లక్ష్మణ్, మహేష్ తదితరులు గురువారం నాడు వేములవాడ మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

అంతిమ సంస్కారం కోసం వచ్చే ప్రజలకు కనీసం నీటి వసతి లేదని, మరుగుదొడ్లను తాళం వేసి ఉంచుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

సజావుగా గ్రామపాలన అధికారి పరీక్షలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం గ్రామపాలన అధికారి పరీక్షల నిర్వహణపై ఎస్పీ మహేష్ బిగీతేతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే గ్రామపాలన అధికారి పరీక్షలకు సిరిసిల్ల జిల్లాలో 65 మంది అభ్యర్థులు హాజరవుతారని గీతానగర్‌లోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ డివిజనల్ నోడల్ అధికారిగా ఈ పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8గంటల వరకు ప్రశ్నాపత్రాలు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షాకేంద్రాలకు సెల్‌ఫోన్‌లు, చేతిగడియాలను అనుమతివ్వవద్దన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్‌చేసి ఎస్కార్ట్‌తో కన్వీనర్ జేఎస్టీయూ హైదరాబాద్‌కు తరలించాలన్నారు. పరీక్ష కేంద్రంలో ప్రతి బెంచ్‌కు ఒక అభ్యర్థి ఉండేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల గెటు ఉదయం 10గంటలకు మూసివేయడం జరుగుతుందని, గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ కోరారు. పరీక్ష కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పాటు చేయాలని ప్రతి అరగంటకు అభ్యర్థులకు సమయం తెలిసేందుకు ఏర్పాటుచేయడంతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలుచేసి పరిసరా ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్‌లను మూసివేయించాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, జిల్లా అడిట్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లోకిని శారద, సెస్ ఎండీ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి

జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ(ఐఆర్‌సీఎస్) సేవలు, ఎన్నికల నిర్వహణ, సభ్యత్వాల నమోదు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అందించిన సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఇతర అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగితెలుసుకున్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న సొసైటీ సభ్యులను అభినందించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ గడువు మే 5నాటికి ముగిసిన నేపథ్యంలో నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు, ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రయాకర్‌రావు వేణుకుమార్, ప్రధానకార్యదర్శి తాటిపాముల శివప్రసాద్, కోశాధికారి బుడిమె శివప్రసాద్, కమిటీ సభ్యులు సంగీతం శ్రీనివాస్, యెల్ల లక్ష్మీనారాయణ, దేవులపల్లి రాజమల్లు, చిదుర నాగశంకర్, కమటాల రాఘవేందర్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప

తంగళ్లపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై ప్రభుత్వం జీలుగు విత్తనాలను అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మహిళా వీవో భవన్లో ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిలుగు విత్తనాల పంపిణీ కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్, ఏపీఎం చంద్రయ్య, ఏవో సందీప్, శ్రీకాంత్‌గౌడ్, మహేందర్, కవిత, శోభా రైతులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండల రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం అందుబాటులోకి ఉన్నాయని రుద్రంగి ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం తెలిపారు. చందుర్తి రైతు వేదికలో గురువారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీఏ, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ఈసరి శ్రీనివాస్, మర్రి కృష్ణ, నాగుల శంకరయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి 460బస్తాలు రాగా, ఒక్కో బస్తా 30కిలోలు ఉంటుందని రెండున్నర ఎకరాలకు బస్తా సరిపోతుందని మండల వ్యవసాయ అధికారి సలావొద్దీన్ తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కోట లింగం, ఎడబోయిన ప్రభాకర్, సోషల్‌మీడియా ఇన్‌చార్జి గౌరిశంకర్, నాయకులు భూమరాజం, నర్సింలు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న స్వరూప

కొనసాగుతున్న వైద్య శిబిరం.. తగ్గని జ్వరాలు..

- ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్న రోగులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

వీర్నపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలోని వడ్డెరకాలనీలో వైద్య శిబిరం కొనసాగుతున్న జ్వరాలు తగ్గడం లేదు. సుమారు పది మందికి పైగా జ్వర బాధితులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జ్వరంతో కీళ్ల నొప్పులు పెరిగి, రక్తకణాలు తగ్గిపోతున్నాయని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని విష జ్వరాల బారిన పడ్డ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు. వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత పరిశీలించారు. గ్రామంలో నీటినిల్వలు లేకుండా చూడాలని, దోమల స్ప్రే, ఆయిల్‌బాల్స్‌ను వైద్య సిబ్బంది వేశారు.

ఆహ్వానించినా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనని కేటీఆర్..



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం తలపెడుతున్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేటీఆర్ ఎందుకు పాల్గొనరని, అధికారులు ఆహ్వానించిన ప్రజాపాలనకు హాజరు కావడం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను సాగిస్తోందని అన్నారు. అధికారిక కార్యక్రమాలకు హాజరు కావాల్సిన ఎమ్మెల్యే కేటీఆర్ ముఖం చాటేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నేతలు, నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సిరిసిల్ల నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్న కేకే మహేందర్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వు పత్రాల పంపిణీలో పాల్గొంటే తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయంలో పోలీసుల పహారా నడమ అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ గ్రామాల్లో పర్యటించారని, ఆయనకు రావడం ఇష్టం లేకనే ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావడం లేదని అన్నారు. అభివృద్ధిని స్వాగతించాల్సింది పోయి విమర్శలు చేయడం సరి కాదని అన్నారు. ఇసుక రవాణాలో అధికారులు ప్రభుత్వ పాలసీని అమలు చేస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నేతలు, నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని నర్సయ్య అన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, కిషన్, బాల్‌రెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.